కథా నిలయం
శ్రీకాకుళం

# వెతుకులాట

మల్లీశ్వరి

**నట్టనడి వేసవి మధ్యాన్నపు ఎండ నా మీదకి ఎగబడుతోంది. ఒకరిద్దరు తప్ప బస్టాప్ అంతా ఖాళీగా వుంది. అంతకంతకూ పెరుగుతున్న తలనొప్పి. ఎంతకూ రాని సిటీ బస్సు చిరాకు తెప్పిస్తున్నాయి. అదుపు తప్పిన ఆలోచనలు క్షణక్షణానికీ దాడి చేస్తున్నాయి.**

**అసహనంగా తల విదిలించాను. వాడిపోయిన ఎర్రెర్రని ఆశయాలు రాలిపడ్డాయి. నిర్వేదంగా వాటి వంక చూశాను. ఒకపుడు అవి మండుతూ నన్ను నిలువెల్లా మండించాయి. యిపుడు తమని భరించే శక్తి లేని ఈ ప్రపంచాన్ని క్షమించి నివురు గప్పుకున్నాయి.**

మరి నేను!! పరిగెత్తేకొద్దీ విశాలమయ్యే తోవ నుంచి వెనక్కి పరిగెత్తడం ప్రారంభించాను. దారి యిరుకవుతున్నకొద్దీ నన్ను నేను కుదించుకుంటున్నాను.

దగ్గరలో ఆశలేమీ లేవు... సిటీబస్సు రాదు... సుదూరంగా మరీచికల జాడా లేదు... ఏ వాహనమూ కనపడటం లేదు.

కాసేపయింది. దూరంగా నల్లటి మిలమిలలు... నల్లటి రోడ్డు మీద నల్లత్రాచులా మెలికలు తిరుగుతూ వస్తోంది నల్లటి పొడవాటి కారు. ఆ కారుతో పాటే జలదరింపేదో గుండెల్లోకి పాకుతోంది. వేడి... వుక్కపోత... గడ్డకట్టిన నిశ్శబ్దం... వుండీ వుడిగీ చిన్న కుదుపుల్లాంటి వింత శబ్దాలు. బయటా... లోపలా...

ఏ మాత్రం చప్పుడు చెయ్యకుండా రహస్యంగా వచ్చి ఎదురుగుండా వున్న హోటల్ ముందు ఆగింది కారు. ముందుగా దిగాడొక వ్యక్తి. నల్లటి జీన్స్, టీ షర్టుల్లో తెల్లగా మెరుస్తున్నాడు. కళ్ళకి గాగుల్స్, మెడలో లావుపాటి బంగారు గొలుసు... తన సంపాదనని ప్రదర్శించడం తెలిసిన మనిషిలా వున్నాడు. విలాసంగా నడుస్తూ లోపలికి వెళ్ళాడు. అయిదు నిమిషాల్లో తిరిగొచ్చి డోర్ తెరిచి చెయ్యందించాడు.

అనాది కుతూహలం రెప్పలార్పకుండా చూస్తోంది... గుండెవేగం తెలీకుండానే పెరిగింది... తెలియబోతున్నది ఈ క్షణమా... మరుక్షణమా... వూగిసలాడుతుండగా అతని చెయ్యందుకోకుండానే కిందకి దిగిందామె.

నాలో మహా విస్ఫోటనం... అప్రయత్నంగా బెంచీ మీద కూలబడ్డాను. అటూ యిటూ బెదురుగా చూస్తూ అతని వెనుక నడిచి వెళ్ళిపోయిందామె. వెళ్ళిపోతోందామె. పగిలిన నా గుండె నుంచి. బలవంతంగా ఒడిసిపట్టి ఆమె వంక విభ్రాంతిగా చూస్తున్నాను.

నా నుంచి ఆమె జరిగిపోతోందని తెలుసు. యిద్దరం ఒకర్నుంచి ఒకరం పారిపోతున్నామని తెలుసు. కానీ ఆమె తన పరుగుకి అర్థాన్ని యిలా వెతుక్కోవాలనుకుందా?

నిరంతరం అసంతృప్తితో, తీరని వస్తు వ్యామోహంతో విలవిల్లాడిపోయే ఆమెకీ, యిపుడిట్లా వెతుకులాటలో పడిన ఆమెకీ మధ్య నలిగిన నా ప్రయాణాన్ని పరిశీలించుకుంటున్నాను.

***

నా ప్రతి వుదయం ఆమె కనుసన్నలలోనే ప్రారంభమౌతుంది. ఎప్పటికపుడు తప్పించుకోడానికి దారులు వెతుకుతాను.

సూర్యుడు లేవకముందే నేను లేస్తాను. ఎందుకంటే వెలుగుకు స్వాగతం చెప్పడం నాకెంతో బావుంటుంది. బాల్కనీ అంచు మీద మోచేతులాన్చి అరచేతుల్లో మొహాన్నుంచి తూర్పు దిక్కుకేసి గొప్ప ప్రేమలో చూస్తుంటాను.

ఆకాశం రంగులు మారుతుంది. ఆ రంగుల్ని కళ్ళతో లాక్కుని హృదయానికి పులుముకుంటాను. అంతటా వింత తళతళలు...

సరిగ్గా అప్పుడొస్తుందామె. గట్టిగా ఆవులిస్తూ రేగిన జుట్టుని వేలు ముడి వేసుకుంటూ, నైటీ సరిచేసుకుంటూ, బాల్కనీలో కుర్చీని బర్‌మనిలాగి కూర్చుంటూ...

"స్థలం కొనడం గురించి రాత్రి చెప్పింది గుర్తుందా?" అంటుంది. నిద్రలో నలిగిన ఆమె సౌందర్యాన్ని ఆస్వాదించబోతాను.

కథ



"ఆ చూపులేంటి?...' అంటూ రుసరుసలాడుతుంది. నిద్రలోనూ మోసిన అసంతృప్తి వలయాలుగా ఆమె కంటికింద పేరుకోడాన్ని చూడలేక తల తిప్పుకుంటాను.

రాత్రి కురిసిన మంచు పూల కుండీల్లోని మొక్కలపై బిందువులుగా పేరుకుంది. లేత ఆకు మీద ముత్యంలాంటి నీటి బిందువు సయ్యాటలాడుతోంది. దాని సోయగాన్ని తదేకంగా చూస్తున్నాను. గాలి వీచింది. బిందువు తొణికి తొణికి ఒడిపోయి కిందకి జారి మట్టిలో కలిసిపోయింది.

"అయ్యో! పడిపోయింది..." బాధగా అన్నాను.

"ఏంటీ?..." కంగారుగా అటూ యిటూ చూసి అడిగింది.

చెప్పాను.

"పని లేనోడికి పనికిమాలిన ఆలోచనలని... నేనడిగిందేంటి? మీరు చెప్పేదేంటి?..." అంది. మాటల్ని ఎంత కఠినంగా చెక్కాలో ఈమెకి తెలిసినంతగా మరొకరికి తెలీదేమో!

"యిన్నేళ్ళనుంచీ వుద్యోగం చేస్తున్నారు. నెలకి యిరవైవేలు సంపాదిస్తున్నారు. సొంత యిల్లు లేదు సరికదా కనీసం గజం స్థలం కూడా లేదు. యిపుడు ఎన్నో లే అవుట్లు వేస్తున్నారు. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కట్టుకోవచ్చు. కనుక్కోమని ఎప్పటినుంచీ చెపుతున్నాను?...

సొంతయిల్లు, ఫర్నిచర్, కారు... యివన్నీ వుంటే ఎంత బావుం టుంది..." ఆమె స్వరంలో కొట్టొచ్చినట్లు వ్యామోహం...

బావుండదు... నాకు కచ్చితంగా తెలుసు. ఎల్లపుడూ మరేదో కావాలనిపించడమేగా జీవితం...

"... వాటికీ వీటికి డబ్బుని తగలేయకపోతే సరిగ్గా ప్లాన్ చేసుకుని పదేళ్ళు కష్టపడితే మన కోరికలు తీరతాయి కదా..." బోలెడు కలలు నింపుకున్న కళ్ళతో అంటుంది.

ఇదొక ఆశా ప్రవాహం. నిండా మునిగిన ఆమెని బయటకి తేవడం నా వల్ల కావడం లేదు.

"ఎందుకంతగా జీవితాన్ని యిరుకు చేసుకోవడం?" వుండబట్టలేక అంటుంటాను. గయ్యిమంటూ లేస్తుంది.

"యిపుడు విశాలంగా బతికేస్తున్నామా? ఈ యిరుకిరుకు గదుల్లో సుఖంగా వున్నామా? చుట్టూ వున్న వాళ్ళని చూసయినా జ్ఞానం తెచ్చుకోండి. ఈ రోజుల్లో స్థలం లేని వాళ్ళంటూ వున్నారా? మన అపార్ట్‌మెంట్‌లో... మా బంధువుల్లో... మీ స్నేహితుల్లో... చుట్టు పక్కలా..." అంటూ వంద పేర్లు ఏకరువు పెడుతుంది.

అపుడామె ముఖం చూసి వులిక్కిపడతాను. ఆమె కోరికలు తీర్చ లేని నా అసమర్థత ఆమె కళ్ళలో పరాయి ఆరాధనగా మారుతుంది. ఈ పరుగులు ఎక్కడికో అర్థంకాక వూహించకుండా వుండలేక వుక్కిరి బిక్కిరయి మరుపుని సాధన చేయసాగాను.

అసలు కలిసి జీవితాన్ని మొదలు పెట్టినపుడు తెలీదు. యిద్దరం సమాంతర రేఖలమని. వ్యక్తిత్వాలు ఎదురుబొదురయ్యాక యుద్ధ ప్రాతిపదికన చర్యలు మొదలెట్టాం.

తను నన్ను మార్చాలనుకుంది.

నేను తనని మార్చాలనుకున్నాను.

ఈ మార్చుకోడాలు ఎంత అసంబద్ధమో అర్థమయి నేను విర మించాను. కానీ ఆమెకి యిప్పటికీ అర్థం కాకపోవడమే విషాదం.

అన్ని సమయాల్లోనూ నేనామెకి అసమర్థుడిగానే కనబడతాను. నాకు డబ్బు సంపాదించడం రాదు. సంపాదించిన ఆ కాస్త మొత్తాన్ని ఎన్ని పథకాలు, ప్రణాళికలతో పొదుపు చేయాలో తెలీదు. నేను ఆడంబరంగా కనపడను. ఆమెకి యిష్టంలేని నా స్నేహితులను రక్తసంబంధాలను తృణప్రాయంగా వదలలేను. పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టను. భవిష్యత్తు గురించి కలలు కనను. ఒకటా రెండా... నా స్వేచ్ఛపై నేను గట్టిగా నిలబడిన ప్రతి అంశం మీదా ఆమెకి ఎన్నో ఆరోపణలు.

ఆమె నన్ను ప్రేమించకపోవడం ఓ సమస్యలా వేధిస్తుంది. కానీ నేను నిలువెల్లా నోట్లకట్టలా రూపాంతరం చెందితే ఆమె నన్ను ప్రేమించగలదన్న చేదు వాస్తవం గుండెల్ని పిండేస్తుంది.

చివరికి పడకగదికీ ఆమె వంటరిగా రాదు.

అసంతృప్తిని వెల్లకిలా పరిచి అయిష్టాన్ని కనురెప్పల కింద దాచి నిరసనని మెడవంపులో అణిచి శరీరాన్ని చలనరహితం చేసి రాత్రిళ్ళు పతివ్రతై ఆమె నా పురుషత్వాన్ని సవాల్ చేస్తుంది.

గెలుపులోని ఆనందం కోసం కాక ఓడిపోవడంలోని అవమానాన్ని ఆమె అసందర్భాల్లో హేళన చేస్తుందన్న జంకు నాది. అందుకే ప్రతిసారీ నా మనశ్శరీరాలతో హోరాహోరీ యుద్ధం చేస్తుంటాను.

అపుడు అనివార్యంగా ఓ ప్రియురాలిని సృష్టించుకుంటాను. తప్పనిసరి వ్యభిచారానికి కుమిలిపోతూ సుఖాన్నీ, దుఃఖాన్నీ ఒకేసారి పొందుతాను.

ఆమెతో కలిసి ఎన్ని మాధుర్యపు నిధులను తవ్వితీయాలనుకు న్నాను! వెన్నెలరాత్రులు పొడవాటి చెట్లకింద వెన్నెల పొడలపై చేయి చేయి కలిపి నడుస్తూ ఆనందపు చివరి అంచుని అన్వేషించాలను కున్నాను.

అకస్మాత్తుగా ఆమె మొహాన్ని నా చేతుల్లోకి తీసుకుని "ఈ క్షణాల్ని ఏం చేద్దాం?" అనడగాలనుకున్నాను. ప్రకృతి పడకపై ఒక్కటై ఒరగాలనుకున్నాను.


నా కోరికని ఆమెతో చెపితే వింతగా చూసింది.

"ఈ పనికి చెట్టూ చేమలదాకా ఎందుకు?... అయినా పురుగూ పుట్రా వుండవా?..." అంది. అంత వాస్తవికతని జీర్ణించుకోవడం నావల్ల కాలేదు.

ఇక ఆమెకి కన్నీళ్ళు ఒక ఆయుధం. మాటల యుద్ధం జరిగినపు డల్లా ఆమె గురి చూసి ఆ ఆయుధాన్ని వదులుతుంది. చిత్తు చిత్తుగా. ఓడిపోయి వున్న నేను నిలువెల్లా కుదిపేస్తున్న కోపాన్ని ఒక్క గుక్కలో దిగమింగి పక్కన చేరి బుజ్జగించబోతాను. చేతి విదిలింపుల్నీ మొహం పక్కకి తిప్పుకోడాల్నీ బోనస్‌గా పొందుతాను.

**ఆమెతో కలిసి ఎన్ని మాధుర్యపు నిధులను తవ్వితీయాలనుకున్నాను! వెన్నెలరాత్రులు పొడవాటి చెట్లకింద వెన్నెల పొడలపై చేయి చేయి కలిపి నడుస్తూ ఆనందపు చివరి అంచుని అన్వేషించాలను కున్నాను.**

**అకస్మాత్తుగా ఆమె మొహాన్ని నా చేతుల్లోకి తీసుకుని "ఈ క్షణాల్ని ఏం చేద్దాం?" అనడగాలనుకున్నాను. ప్రకృతి పడకపై ఒక్కటై ఒరగాలనుకున్నాను.**



"యిట్లా గొడవలు లేకుండా సంతోషంగా వుండలేమా?..." అడిగానోసారి.

"గొడవలు పడటం నాకేవన్నా సరదానా? మనకన్నా తక్కువ్వాళ్ళు అలా అలా ఎదిగిపోయి మేడల్లో వుంటూ కార్లలో తిరుగుతుంటే మనవేమో యిలా... నలుగురిలో నాకెంత చిన్నతనం? 'కొత్త నగలు ఏవీ కొన్నట్లు లేవే.. మీ ఆయన సంపాయించడా?' అని ఎవరో ఒకళ్ళు అంటూనే వుంటారు. అందరిలో గొప్పగా చెప్పుకోడానికి నా తరుపున ఏవుంది. నేను పెళ్ళి చేసుకోనన్న మా బావ యిపుడు కోటీశ్వరుడు. ఓ... పెళ్ళాం అంటే ఎంత అపురూపం!! ప్లాటినం జ్యూయలరీ... డిజైనర్ శారీ... నా వంక ఎంత చులకగా చూశాడో తెలుసా? పొట్టకోస్తే అక్షరమ్ముక్క రాదుగానీ..." వుక్రోశంగా అంది.

"నా పొట్ట కోసి చూసి చేసుకున్నావా?..." అడిగాను.

చిన్నగా నవ్వి అరుదుగా కనిపించే ముచ్చట చూపులతో నన్ను చూసి "మిమ్మల్ని చూస్తే బాగా చదువుకున్న వాళ్ళలా తెలివిగా

కనబడతారు. కానీ ఏం లాభం? మీకు చదువు తెలివి ఎక్కువయిపోయి కుటుంబానికి ఉపయోగపడటం మానేసాయి" ఓ విరుపు విరిచి వెళ్ళిపోయింది.

గతమంతా నడిచి నడిచి అలిసి వర్తమానంలోకి వచ్చిపడ్డాను. సమయం అయిదుంపావు అయింది. ఈసారి ఆమె తిరిగి రావడాన్ని నిర్విచారంగా చూడటానికి ప్రయత్నించాను.

ఆమెకున్న లైంగిక స్వేచ్ఛని గౌరవించడానికి మనసు మూలలో మిగిలున్న అవశేషాలు ఏవో కాసేపు యిబ్బంది పెట్టాయి. ఎంత యాతన యిది... రాత్రిళ్ళు ఆమెతో గడిపినప్పటి వూహలు గుర్తొచ్చాయి. ఆమెని అవమానించే అర్హత నాకు లేదనిపించింది నాలో వున్న చిన్నపాటి అహమూ క్రమంగా కరిగిపోయింది.

కాకపోతే పదేళ్ళు సహచరిగా వున్న ఆమె పట్ల బాధ్యత పెరిగినట్లనిపించింది నేను మగాడిగా కాక మనిషిగా ఆలోచించడం ప్రారంభించాను.

***

"నాతో కలిసుండటం నీకు సంతోషంగా వుందా?..." సాయంకాలపు నీరెండలో పరధ్యానంగా కూర్చున్న ఆమెని అడిగాను.

వులిక్కిపడి చూసింది. కళ్ళలో భయం. కానీ వెంటనే సర్దుకుని...

"యిదేం ప్రశ్న?..." నిరసనని నటిస్తూ గబగబా లేచి వెళ్లబోయింది.

**"ఏవంటున్నారు? ఏదో తెలిసినవాళ్ళతో మాట్లాడితే సంబంధం అంటగట్టేయడమేనా? ఏం చాతకాకపోయినా అనుమానించడం మాత్రం వచ్చు. మీరిలాంటి వాళ్ళనుకోలేదు..." ఏదేదో అంటూ చివరికి ఏవనాలో తెలీనట్లు గజగజ వణికిపోతూ గోడనానుకుని నిల్చున్నదల్లా కిందకి జారిపోయి భయంతో వుండ జుట్టుకుపోయి చేతుల్లో మొహం దాచుకుని గావురుమని ఏడ్చింది. కాసేపు గడిచింది.**

"నాకు తెలుసు..." నింపాదిగా అన్నాను నేను. గిరుక్కున తిరిగి నా వంక చూసింది.

"గత నెలలో రెండుసార్లు... అతనితో... బస్టాప్ దగ్గరి హోటల్కి..." నా మాటలు వింటూనే కొయ్యబారినట్లు నిల్చుండిపోయింది.

"నా దగ్గర సంతోషం, స్వేచ్ఛ నీకు లేవా?... నాతో కలిసుండగలవా?..." అడిగాను.

"ఏవంటున్నారు? ఏదో తెలిసినవాళ్ళతో మాట్లాడితే సంబంధం అంటగట్టేయడమేనా? ఏం చాతకాకపోయినా అనుమానించడం మాత్రం వచ్చు. మీరిలాంటి వాళ్ళనుకోలేదు..." ఏదేదో అంటూ చివరికి ఏవనాలో తెలీనట్లు గజగజ వణికిపోతూ గోడనానుకుని నిల్చున్నదల్లా కిందకి జారిపోయి భయంతో వుండ జుట్టుకుపోయి చేతుల్లో మొహం దాచుకుని గావురుమని ఏడ్చింది. కాసేపు గడిచింది.

"నేను మాట్లాడేది సంబంధాల గురించి కాదు. మనిద్దరి మధ్యా వుండాల్సిన స్నేహం గురించి అడుగుతున్నాను" మృదువుగా అన్నాను.

తనకేం అర్థం కాలేదు. ఎర్రబడిన కళ్ళతో నా వంక ఓ సారి చూసి మోకాళ్ళ మధ్య మొహం పెట్టుకుని...

"ఏదో జరిగిపోయింది. ఎట్లానో తెలీదు... తప్పు చేశాను. పాపిష్టిదాన్ని. నాకేదో దెయ్యం పట్టింది. నన్ను చంపేస్తారు మీరు. నాకు తెలుసు... అయ్యో!..." హిస్టీరిగ్గా అంటూ వుక్కిరిబిక్కిరయిపోతోందామె.

నా మనసు ద్రవించిపోయింది. తన స్వాభావిక స్వేచ్ఛపై యింకొకరి జడ్జిమెంట్ అవసరమయినట్లు పరాధీనతతో కొట్టుమిట్టాడుతోంది. ప్రత్యక్ష, పరోక్ష సంబంధాల నేపథ్యంలో యిక్కడ నేనే నేరగాడిని. ఆమెకి అర్థమయ్యేలా ఎలా చెప్పడం?

నాకు నేనుగా, ఆమెకి ఆమెగా విడివడి కూడా పిల్లల కోసం కలిసుండటం తప్పనిసరయ్యాక పెద్దరికాన్ని సాయమడిగి ఆమెనో పసిపాపలా ప్రేమించడం మొదలుపెట్టాను. ప్రేమించడం ఎంత కష్టం!! అయినా అనుక్షణం ఎదురయ్యే గాయాలకి ఆమె అమాయకత్వాన్ని కారణంగా చూపి బుజ్జగించాను. యిపుడు ఆమెపై నాకున్న ఈ ఆఖరి నియంత్రణనీ వదులుకునే అవకాశం వచ్చింది.

ఆమె కోరితే మంచి చెడులు అంచనా వేసి చెప్పడం తప్ప తన చర్యల్ని ప్రశ్నించే నియంతృత్వం నాకెందుకు? ఆమె విజ్ఞతతో నిర్ణయాలు తీసుకోవాల్సిన అంశాల మీద నా అధికారాన్ని ప్రదర్శించడం ఎందుకు? యింకా వెక్కిళ్ళు పెడుతూ ఏడుస్తున్న ఆమెని పొదివి పట్టుకున్నాను. బెరుకుగా చూస్తూ దూరంగా జరగబోయింది.

"నేను నిన్ను అర్థం చేసుకున్నాను..." చెప్పాను.

ఆమె నా వంక వింతగా, అనుమానంగా చూస్తూ...

"నాకు తెలుసు... యిలా మంచి మాటలు చెపుతూ నన్ను చంపడానికి ప్లానేస్తున్నారు... మీరిదంతా ఓర్చుకోవడం అందుకే..." అంది. నా చేతులు వదులవ్వబోయాయి. అతి ప్రయత్నం మీద నిగ్రహించుకుని...

"నువ్వు నీ ప్రపంచాన్ని దాటి ఎందుకు చూడవు? అటువైపు ఏవుందో తెలుసుకునే ప్రయత్నం ఎందుకు చెయ్యవు?..." ఆరాటంగా అడిగాను.

ఆమె తొలిసారి నా వంక కొత్తగా చూసింది.

***

రోజులు గడుస్తున్నాయి. నేను ఎప్పట్లాగే పుస్తకదాహంతోనూ, సహచరులతో సుదీర్ఘ చర్చల్లోనూ, నిర్మాణాత్మక కార్యాచరణలోనూ వెతుకులాడుతూనే వున్నాను.

ఆమె మాత్రం అటొచ్చి, యిటొచ్చి నా మొహంలోకి ఏదో వెతుకుతున్నట్లు చూసేది. నా చిరునవ్వో, నిర్మలమయిన ముఖభావాలో భరోసా యిచ్చేవి కాబోలు తేటపడిన కళ్ళతో నిట్టూర్చేది.

రోజూ మాదిరిగానే ఆ రోజూ సూర్యుడిని ఆహ్వానించడానికి బాల్కనీలో సిద్ధంగా వున్నాను. వెనుక మెత్తని అడుగుల సవ్వడి. తల తిప్పి చూసాను. లేతభానుని తొలికిరణం ఆమె ముఖంపై అద్భుతంగా మెరిసింది. ఆరాధనగా చూశాను.

ఆమె నా చేతిని మెల్లగా స్పృశిస్తూ... "మీరిదంతా ఎలా భరించగలిగారు?..." అంది.

తల అడ్డంగా తిప్పాను..." నీ జీవితంపై సమస్త నిర్ణయాధికారాలూ నీవే!..." లోపల యింకే నలుసులూ లేకపోవడం మూలంగానేమో నా మాట స్పష్టంగా వచ్చింది.

ఆమె అబ్బురంగా చూస్తూ... "యింత శక్తి ఎలా వచ్చింది?..." అంది. నేను నా చేతిలోని పుస్తకం వంక ఆప్యాయంగా చూశాను.

ఆ రాత్రి నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి నా పుస్తకాల రాక్ దగ్గర ఆమె. తన చేతుల్లో ఈ ప్రపంచాన్ని వూగించి, శాసించిన పుస్తకం. ఆమె నా కోసం, కేవలం నన్ను సంతోషపెట్టడం కోసమే ఈ ప్రపంచంలోకి అడుగు పెడుతోందని తెలుసు.

కానీ ఎలాంటిది ఈ ప్రపంచం!! హత్తుకోవాలేగానీ నిలువెల్లా సౌందర్యంతో తీర్చిదిద్దదూ...

నన్ను చూడగానే చిన్నగా నవ్విందామె. బుగ్గల్లో నునుసిగ్గు మొగ్గలు విరిసాయి. కళ్ళల్లో కాంతిరేఖలు... వెరసి మోహాన్ని ముంచెత్తుతున్న సంతోష కెరటాలు... బహుశా ఆమె నాతో ప్రేమలో పడుతున్నట్లుంది.